మహా శివరాత్రి .. ప్రత్యేక బస్సులు

- 21వ తేదీ వరకు ఏడుపాయలకు బస్సు సౌకర్యం
- పండగ రోజు 24 గంటలపాటు బస్సులు
- పటాన్‌చెరు-బీరంగూడకు స్పెషల్ బస్సు
- భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : డీఎం శ్రీనివాస్





రాయదుర్గం: 'మహాశివరాత్రి' పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడిపేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో తగు ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ పి శ్రీనివాస్ తెలిపారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ హెచ్‌సీయూ డిపో ద్వారా పటాన్‌చెరు బస్టాండ్‌లో ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ఎంతో ఉపయుక్తమని ఆయన పేర్కొన్నారు.

ప్రశ్న: పండగ రోజు ఎన్ని బస్సులు నడుపుతారు?

జ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు నుంచి బీరంగూడ వరకు ప్రత్యేకంగా 15 బస్సులను నడుపుతాం. ట్రాఫిక్‌ను బట్టి మరిన్ని షటిల్ బస్సులను పెంచడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. అలాగే ఏడుపాయల జాతర సందర్భంగా పటాన్‌చెరు బస్టాండ్ నుంచి 21వ తేదీ వరకు 20 బస్సులను నడుపుతాం. పటాన్‌చెరు నుంచి దౌల్తాబాద్, హత్నూర మీదుగా జాతర జరిగే చోటు వరకు బస్సులు వెళ్తాయి.

ప్రశ్న: హెచ్‌సీయూ డిపో ద్వారా కొల్లూరుకు బస్సులు ఉన్నాయా?

జ: హెచ్‌సీయూ డిపో ద్వారా రూట్ నంబర్ 219/220 కె బస్సును కొత్తగా నడిపేందుకు నిర్ణయించాం. అయిదు బస్సులతో 40 నిమిషాల ఫ్రీక్వెన్సీతో సికింద్రాబాద్ నుంచి కేపీహెచ్‌బీ, లింగంపల్లి మీదుగా కొల్లూరు వరకు ఈ బస్సు నడుస్తుంది. సికింద్రాబాద్‌లో మొదటి బస్సు 6.55 గంటలకు, చివరి బస్సు రాత్రి 20.30 గంటలకు బయలు దేరుతుంది. అదేవిధంగా కొల్లూరు నుంచి మొదటి బస్సు ఉదయం 5.15 గంటలకు ప్రారంభమవుతుండగా రాత్రి 19.55 గంటలకు బయలు దేరుతుంది.

ప్రశ్న: ప్రయాణికుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలు?

జ: సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులు మేలు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అన్ని రూట్లలో ట్రిప్పులను పెంచుతాం. ఈ సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఖాజాగూడలో కేసీఆర్ జన్మదిన వేడుకలు

రాయదుర్గం: సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు జంగయ్యయాదవ్, నరేష్, అంజమ్మ, రాజుముదిరాజ్, రమేష్‌గౌడ్, గోవింద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడే పటాన్‌చెరులో మహా శివరాత్రి మహా జాగరణ

పటాన్‌చెరు: మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం సాయంత్రం 6 గంటలకు మైత్రి మైదానంలో నిర్వహించనున్న మహా జాగరణ, లింగోద్భవ కార్యక్రమాల ఏర్పాట్లను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. జాగరణకు హాజరయ్యే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, పశు సంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

క్షయ వ్యాధి వార్డు ప్రారంభం

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయ వ్యాధి వార్డు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం ఈ వార్డును రంగారెడ్డి జిల్లా క్షయ వ్యాధి అధికారి అరుణ కుమారి, సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారితో కలిసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షయ (టీ.బీ) వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శేరిలింగంపల్లి ప్రాంతవాసులు దూరంగా పోకుండా ఇది ఉపయోగపడుతుందన్నారు. హెచ్ఐవీ పేషెంట్లు, డయాబెటీస్, పొగ తాగే వారు, పోషకాహార లోపం ఉన్న వారికి టీబీ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల పోషణ భత్యం కింద రూ.500 ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 8 లక్షల 51 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, మాధవరం రోజాదేవి, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గీతంలో 'ప్రమాణ' జోష్

పటాన్‌చెరు టౌన్: ఎటు చూసినా పండగ వాతావరణం.. వైజ్ఞానిక ప్రదర్శనలు.. శాస్త్రీయ పోటీలు.. ఉప్పొంగే ఉత్సాహం మధ్య గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రమాణ – 2023 కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన టెక్నో మేనేజ్‌మెంట్ కల్చరల్ ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యాలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వీసీ ప్రొఫెసర్ డీఎన్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, ఫెస్ట్ చైర్మన్ డాక్టర్ త్రినాథరావు, క్రమశిక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్థల దాతకు సన్మానం

మియాపూర్: నియోజకవర్గంలోని గౌడ కుటుంబ సభ్యులను ఏకతాటిపైకి తీసుకురావాలని రూ.5కోట్లు విలువైన స్థలాన్ని గౌడ హాస్టల్‌కు విరాళంగా ఇచ్చిన దాత దొంతి లక్ష్మీ నారాయణగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్‌లోని సుప్రజ హోటల్‌లో శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గౌడ సేవా సంఘం ప్రముఖులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనారాయణగౌడ్‌ను సంక్షేమ సభ్యులు వెండి కిరీటంతో సన్మానించారు.కార్యక్రమంలో అశోక్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, కృష్ణగౌడ్, రాములుగౌడ్, శంకర్ గౌడ్, యాదగిరిగౌడ్, మూల వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ప్రత్యేక వర్క్‌షాప్

రాయదుర్గం: మనూ ఫ్యాకల్టీ సభ్యుల కోసం ఈనెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు 'ఇ-కంటెంట్ ప్రొడక్షన్ టెక్నిక్‌ల'పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు.

ఆర్ట్‌గ్యాలరీలో వస్త్ర ప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. నారాయణపేట్, కొత్తకోట చేనేత కళాకారులు తయారు చేసిన చీరలను శుక్రవారం ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనను ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్. కె.లక్ష్మి ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో సిల్క్, పైథాని, కాటన్ చీరలు అందుబాటులో ఉన్నాయని, ఉదయం 11గంటల నుండి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. 10శాతం రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపారు.

21 నుంచి దస్తకారీ హాత్ క్రాఫ్ట్ బజార్

రాయదుర్గం: భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శించేందుకు గచ్చిబౌలిలో ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో తొలిసారిగా దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్ నిర్వహించనున్నారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) ప్రాంగణంలో ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'దస్తకారీ హాత్ క్రాఫ్ట్ బజార్' పేరిట ప్రత్యేక ప్రదర్శన జరగనుంది.


అడ్డా కూలీలకు అవగాహన

హాఫీజ్‌పేట్: లేబర్ అడ్డా వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని హాఫీజ్‌పేట్ చిల్లా లేబర్ అడ్డా కూలీలకు పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ దశరథ్ మాట్లాడుతూ పనులు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళా కూలీలు అపరిచితులను నమ్మవద్దని, ఒక వేళ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు తెలియపర్చాలని సూచించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వినతి

శేరిలింగంపల్లి: లింగంపల్లిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ని కలిసి సమస్యను వివరించగా ఆయన సీవరేజ్ బోర్డు అధికారులతో మాట్లాడి వెంటనే పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గడ్డం రవియాదవ్, గౌరవ అధ్యక్షులు సోమయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం యాదవ్, ప్రతినిధులు లక్ష్మణ్ యాదవ్, సాయి, సతీష్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: శివరాత్రిని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం నాట్యాచార్య డాక్టర్ పసుమర్తి రామలింగశాస్త్రి శిష్యబృందం భరత నాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో శివశబ్దం, లింగాష్టకం, శంకర శ్రీగిరి అంశాలను ప్రదర్శించారు. కళాకారులు యమినిరెడ్డి, శ్వేత, అంజు, స్రవంతి, సాయి, అపర్ణ, సుష్మిత, నాయన, సాగర్, నాగరత్న, విశ్వనాథ్ పాల్గొన్నారు.

దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం
- సీఎం కేసీఆర్ బర్త్ డే కేక్ కట్ చేసిన గాంధీ

గచ్చిబౌలి: కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కేసీఆర్ విజన్‌తో అభివృద్ధిలో పరుగులు పెడుతున్న తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జనరంజక పాలనతో తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని ఆయన కొనియాడారు. మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన 200 మందిని ఆయన అభినందించారు. అన్ని దానాల కన్న రక్త దానం గొప్పదని, ప్రతి ఒక్కరు సామాజిక స్పృహతో రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు అనంతరం కేసీఆర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. కొండాపూర్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వరదాచారి, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో కేసీఆర్ బర్త్ డే కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

బ్రహ్మకుమారీస్ సేవలు ఆదర్శం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బ్రహ్మకుమారి సంస్థ చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని సినీ నటుడు మురళీమోహన్, సినీనటి జీవిత రాజశేఖర్ అన్నారు. శుక్రవారం బీహెచ్‌ఈఎల్‌లోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ఏర్పాటుచేసిన శివ జయంతి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సమాజంలో శాంతి కోసం బ్రహ్మకుమారి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి, బ్రహ్మకుమారీస్ సెంటర్ నిర్వాహకురాలు, మీడియా కోఆర్డినేటర్ సరళ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు: సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోవింద్, సీనియర్ నాయకులు బూరుగడ్డ నగేష్, వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలంతా పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో మెట్లకుంట చెరువులో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి డ్రోన్ యంత్రం సహాయంతో శుక్రవారం దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల బెడద నివారణలో ప్రజలంతా సహకరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజీ విభాగం చేపడుతున్న చర్యలతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమలను చాలా వరకు నియంత్రించవచ్చన్నారు. ఇంటితోపాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్ విశ్వప్రసాద్, నర్సింహులు, యాదగిరి తిమోతి, స్థానికనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ లైఫ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్ తదితరులు

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈపీటీఆర్ఐ సైంటిస్టులు విద్యార్థులకు వివరించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ని బాచుపల్లి ఓక్రిడ్జ్ విద్యార్థులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ దిశగా పనిచేస్తున్న మిషన్ లైఫ్ గురించి సైంటిస్టు సునీల విద్యార్థులకు వివరించారు. జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం, నీటిని సంరక్షించడం, హెర్బల్ గార్డెన్, వేస్ట్ రీసైక్లింగ్ కాంప్లెక్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ గురించి వివరించారు. ప్రతి ఒక్కరు పర్యావరణ స్పృహతో జీవించాలని, మిషన్ లైఫ్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్ సూచించారు.

మిల్లెట్స్‌పై అవగాహన



సాక్షి సిటీబ్యూరో: మిల్లెట్స్ అంతర్జాతీయ దినోత్సవంను పురస్కరించుకుని నయా మిల్లెట్స్.. కామధేను ప్యూర్లీ నేచురల్స్ పేరిట '365 రోజులు..365 స్థలాలు..365 మందికి' అనే నినాదంతో శుక్రవారం అంజన్‌కుమార్ అనే వ్యక్తి అశోకా లివియానో టవర్స్‌లో రాగి ఇడ్లీ, పొంగల్, కిచిడీ అందజేశారు. ఈ సందర్భంగా గోవు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు.

శివపార్వతుల కల్యాణం

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానంలోని శివాలయంలో శనివారం ప్రత్యేక పూజలతో పాటు, శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మసాజ్ సెంటర్‌పై దాడి

గచ్చిబౌలి: మసాజ్ సెంటర్‌పై దాడి చేసి అయిదుగురిని అరెస్ట్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం కొండాపూర్‌లోని రాజరాజేశ్వరికాలనీలో రెస్ట్ బ్యూటీ స్పాపై యాంటీ విమెన్ ట్రాకింగ్ యూనిట్ బృందం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. స్పా నిర్వాహకుడు రాగం శ్రీశైలం(30) రేణయ్య అలియాస్ డి కార్తీక్ (25), సబ్ ఆర్గనైజర్ అబ్దుల్ రషీద్(29), విటుడు సయ్యద్ జమీల్(29)లను అదుపులోకి తీసుకొని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఆర్గనైజర్ అర్జున్ పరారీలో ఉన్నారు. బాధితులను రెస్క్యూ హోంకు తరలించారు. 5 స్మార్ట్ ఫోన్లు, ఒక ఐ ఫోన్, స్వైపింగ్ మిషన్, మూడు కండోమ్ ప్యాకెట్లు, రూ.2,950 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న డీసీపీ శిల్పవల్లి, అధికారులు

మాదాపూర్: గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ నుండి కొండాపూర్ ఆర్టీఎ ఆఫీసు వైపు కొత్త రోడ్డులో గురువారం ఉదయం 11 గంటలకు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన సౌరవ్‌సింగ్(29), జై ప్రకాశ్‌సింగ్(26), రాధా(20) ముగ్గురు హోండాసిటీ కారులో సీటు వెనుక ఒక రహస్య బాక్సులో గంజాయి పెట్టి తరలిస్తున్నట్టు తెలిపారు. నిందితుల నుంచి 23 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, 2 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వీటి విలువ రూ.6లక్షలు ఉంటుందన్నారు. ఒరిస్సాలో ఉన్న డార్లిపుట్ ప్రాంతం నుండి అరకు, విజయవాడ, హైదరాబాద్, ముంబై , షోలాపూర్ మీదుగా మధురకు తరలిస్తున్నట్టు తెలిపారు .పోలీసులకు అనుమానం రాకుండా రహస్య క్యాబిన్ తయారు చేసి పైన రాగి కంకుల ప్యాకెట్‌లు ఉంచి లోపల గంజాయి రవాణా చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో మాదాపూర్ సీఐ తిరుపతి,ఎస్సై అవినాష్ బాబు, ఎల్.జగన్, పీసీలు వినయ్‌కుమార్, యాదయ్య, రాజేంద్ర, వినయ్‌దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మల్లికార్జునస్వామి ఉత్సవాలు

పటాన్‌చెరు టౌన్: బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలు శుక్రవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యహావాచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణ, నవగ్రహారాధన అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి బిల్వార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకుడు ప్రహ్లాద తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శశిధర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌లు మాట్లాడుతూ...ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.